క్లుప్తంగా

చెస్ పోటీల్లో విజేతకు అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మంసహకారనగర్: ఇటీవల ముంబైలో జరిగిన అంతర్జాతీయస్థాయి కరాటే పోటీల్లో నిర్మల్ హైస్కూల్ విద్యార్థి ముదిశెట్టి భానుప్రసాద్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆయనను అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ మంగళవారం అభినందించారు. పాఠశాల యజమాన్యం సూరపునేని యోగిరాం, సూరపునేని జ్యోతిర్మయి, ఎస్.నిర్మల పాల్గొన్నారు.

ఒకేసారి కరెంట్ బిల్లు కట్టలేను..

- సోషల్ మీడియా వేదికగా మహిళ ఆవేదన

రఘునాథపాలెం: నాలుగేళ్ల కిందట విద్యుత్ కనెక్షన్ ఇచ్చి.. మీటర్ పెట్టలేదని, ఇప్పుడు నాలుగేళ్ల బిల్లు ఒకేసారి చెల్లించాలని విద్యుత్ అధికారులు వేధిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని మండలంలోని బూడిదంపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జి.రాధకు 2018లో విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. కానీ, మీటర్ పెట్టలేదు. ప్రస్తుతం కరెంట్ బిల్లు రూ.57 వేలు వచ్చిందని, మొత్తం ఒకేసారి చెల్లించాలని విద్యుత్ అధికారులు తెలిపారు. తాను ఒకేసారి అంత కట్టలేనని రాధ చెప్పింది. దీంతో రూ.20 వేలు కడితే సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. అలా రూ.20 వేలు కట్టించుకుని ఇప్పుడు మిగిలిన డబ్బు మొత్తం కడితేనే సమస్య పరిష్కారమవుతుందని, లేదంటే కేసు పెడతామంటూ విద్యుత్ అధికారులు బెదిరిస్తున్నారని సోషల్ మీడియా వేదికగా రాధ వాపోతోంది. ఈ వీడియో మండలంలో వైరల్‌గా మారింది.

నేటి నుంచి ఉపవాస దీక్షలు

ఖమ్మంరూరల్: క్రైస్తవుల ఉపవాస దీక్షలు బుధవారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 7వ తేదీ గుడ్‌ఫ్రైడే వరకు కొనసాగుతాయని కరుణగిరి ఆర్‌సీఎం చర్చి డైరెక్టర్ ఫాదర్ మాథ్యూ వరప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కఠిన ఉపవాస దీక్షల్లో క్రైస్తవులు పాల్గొని దైవప్రార్థనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కరుణగిరి చర్చిలో ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు పుణ్యక్షేత్ర మహోత్సవాలను నిర్వహిస్తున్నామని, బిషప్ ఉడుముల బాలచే ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని తెలిపారు.

రైళ్లపై రాళ్లు రువ్వితే కఠిన చర్యలు

ఖమ్మంక్రైం: రైళ్లపై రాళ్లు రువ్వే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉద్యోగులు హెచ్చరించారు. ఇటీవల వందేభారత్‌తో పాటు ఇతర రైళ్లపై రాళ్లు రువ్విన ఘటనలు నమోదైన నేపథ్యాన నగరంలో ట్రాక్ వెంట ఉన్న రాపర్తినగర్, తదితర ప్రాంతాల్లో అధికారులు మంగళవారం సాయంత్రం అవగాహన కల్పించారు. రైళ్లపై రాళ్లు రువ్వే వారిని గుర్తించి కేసు నమోదు చేస్తామని, శిక్షలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, జీఆర్పీ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	వినరోభాగ్యము విష్ణుకథ
సాయిరాం	యాంట్‌మ్యాన్ (తెలుగు)
ఆదిత్య	యాంట్‌మ్యాన్ (ఇంగ్లిష్)
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	అమిగోస్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	20		20
కాకర	30	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	46	తోటకూర	2
దొండ	30		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	46		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		20
చామగడ్డ	64	పుదీన	1
క్యారెట్	34		20
బీన్స్	46	-ఖమ్మం వ్యవసాయం	

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



లింగారంతండా సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు (ఇన్‌సెట్) తీగలు కర్రతో ఎత్తి పట్టుకుని వరికోత యంత్రాన్ని తీసుకొస్తున్న దృశ్యం

- చేలల్లో కిందకు వేలాడుతున్న వైర్లు
- దుక్కి దున్నడం, కోతలు కోసేటప్పుడు పొంచి ఉన్న ప్రమాదం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతులు

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. చేలల్లో దుక్కులు దున్నేటప్పుడు, కోతల సమయాల్లో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు వెళ్లాలంటే ప్రమాదంగా మారుతోంది. తీగలను కర్రలతో పైకెత్తి వాహనాలను ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంది. అంతేకాక చేలల్లో పశువులు సంచరించేటప్పుడు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..

విద్యుత్ తీగలు కిందకు వేలాడటంతో పలు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైతులు సమస్యను తీర్చాలని విద్యుత్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా పలు కారణాలు చూపిస్తూ మరమ్మతులు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఇక విద్యుత్ స్తంభాల మార్పిడి, లైన్లు సరిచేయటం ప్రయాసగా మారుతోంది. లూజ్ వైర్లు సరిచేయటం, మిడిల్ పోల్స్ వేయటం, విద్యుత్ శాఖ ద్వారా చేపడుతున్న స్తంభాల మార్పిడికి అయ్యే ఖర్చు రైతులే భరించాల్సి వస్తోంది. దీంతో సమస్య మరింత జటిలమవుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మా దృష్టికి తీసుకురండి..

చేలల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడి ప్రమాదకరంగా మారితే వెంటనే మా దృష్టికి తీసుకురండి. తక్షణమే స్పందించి తగు చర్యలు చేపడతాం. స్తంభాలను తొలగించి వేరొక చోట వేయాలంటే అందుకయ్యే వ్యయం రైతులే భరించాలి. లూజ్ వైర్లు సరిచేయటం, మిడిల్ పోల్స్ వేయడం వంటివి మేమే చేపడతాం.

– కోక్యానాయక్, ఏడీఈ

చేతికందేలా ఉన్నాయి..

మా చేనులో కరెంటు తీగలు కిందకు వేలాడుతూ చేతికి అందేలా ఉన్నాయి. ఈ తీగలతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. వరి కోయాలంటే కోత మిషన్ వాళ్లు తీగలు చూసి భయపడి రావడం లేదు. దుక్కి దున్నాలన్నా ట్రాక్టర్లు రావటం లేదు. ఈ తీగలను సరిచేసి ప్రమాదం లేకుండా చూడాలి.

– లింగారెడ్డి, రైతు

ఘనంగా మాతృభాషా దినోత్సవం



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



గీతాంజలి పాఠశాలలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ అప్పారావు



ఖమ్మంమయూరిసెంటర్: మాట్లాడుతున్న కవి, రచయిత అట్లూరి వెంకటరమణ



సర్వజ్ఞ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయిని

ఖమ్మంసహకారనగర్: నగరంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఢిల్లీ విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ కేశవ్‌కుమార్ బుక్ రీడర్స్ క్లబ్‌కు బహూకరించిన అంబేడ్కర్ రచనలను ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా విడుదల చేయగా, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీవీ రెడ్డి, డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ సీతారాం, జర్పుల రమేశ్, ఎ.సాంబశివరావు పాల్గొన్నారు. గీతాంజలి పాఠశాలలో కూడా మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించగా కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్ పాల్గొన్నారు. వీడీవోస్‌కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ భాషా దినోత్సవంలో డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ, ఉపాధ్యాయులు మాట్లాడారు.

ఖమ్మంమయూరిసెంటర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో కవి, రచయిత అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ మాతృభాషతోనే సకల విజయాలు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, ఎస్సీ బాలుర వసతిగృహం(బీ)లో నిర్వహించిన కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి కె.రుక్మారావు, రచయిత కె.బ్రహ్మం మాట్లాడారు. తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు. ఎ.శ్రీధర్, మాన్సింగ్, వెంకన్న, నరేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించొద్దు..



వినతిపత్రం ఇస్తున్న నాయకులు



మాట్లాడుతున్న మందడి ఇజ్రాయెల్

నేలకొండపల్లి: విద్యుత్ శాఖ అధికారులు ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించే చర్యలను నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి కేవీ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ప్రతినిధి బృందం విద్యుత్ శాఖ ఏఈ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కేవీ రెడ్డి మాట్లాడారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రైతులను ఇబ్బంది పెడుతున్నారని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

తిరుమలాయపాలెం: విద్యుత్ మోటార్లకు అమర్చిన ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించే ప్రక్రియ నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మందడి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. మంగళవారం తెట్టెలపాడు గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి మాట్లాడారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో బాజా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో కొనసాగిన వేడుకలు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఈసీఈ, ఈఈఈ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. కళాశాలలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా బోధన చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఉద్యోగావకాశాల కోసం ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జి.సుభాష్‌చందర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ

శాంతి స్థాపనే జమాతే ఇస్లామి హింద్ ధ్యేయం



మాట్లాడుతున్న హమీద్ మొహమ్మద్‌ఖాన్

ఖమ్మంమామిళ్లగూడెం: శాంతిస్థాపనే జమాతే ఇస్లామి హింద్ ధ్యేయమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హమీద్ మొహమ్మద్‌ఖాన్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం ఐఎంఏ హాల్లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ సంఘం పేదలు, అభాగ్యులు, వితంతువులు, రోగులకు సాయం చేయడంతోపాటు సమాజంలో విపత్తులు సంభవించినప్పుడు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తోందని తెలిపారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడు అబ్రార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎండీ ఇలియాస్, ఎండీ సాధిక్, ముఫ్తీ జలాలుద్దీన్, అబ్దుల్ రవూఫ్‌ఖాన్‌ఖాస్మీ, హిమాయతుల్లా రూరల్ అధ్యక్షుడు అబ్దుల్‌ముజీబ్, ఖలీల్ అహ్మద్‌ఖాన్, సుబూర్, జమీల్‌అహ్మద్‌ఖాన్, అబ్దుల్‌మల్లిక్, జాఫర్‌మతిన్, గౌస్, అమేర్, ఫైజాన్, ఖాసీం పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం, ప్రతిష్ఠ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని విజయనగర్‌కాలనీ శ్రీషిరిడీ సాయిబాబా మందిరం, శ్రీ సిద్ధి వినాయక సహిత దత్తాత్రేయ స్వామి ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో, భక్తిశ్రద్ధలతో కోలాట నృత్యాలతో దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో మందిరం చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్యసిద్ధాంతి, వైస్ చైర్మన్ బుద్ధ రామకృష్ణ, సెక్రటరీ పెంట్యాల వెంకటనరసయ్య, జాయింట్ సెక్రెటరీ చంద్ర వీరభద్రరావు, సభ్యులు మండెపూడి కృష్ణయ్య, దొడ్డ నరసింహారావు, భూక్యా భిక్షపతి, కార్పొరేటర్ పైడిపల్లి రోహిణి, మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్‌రావు, స్థానికులు మంకెన శ్రీనివాసరావు, గోపాలపురం వెంకటాచారి పాల్గొన్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిష్ఠ కార్యక్రమాలుంటాయని చైర్మన్ రాజలింగయ్య కోరారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

కొనసాగుతున్న కంటివెలుగు

కూసుమంచి: మండలంలో కంటివెలుగు శిబిరం పది గ్రామాల్లో పూర్తి కాగా నాయకన్‌గూడెం, పెరికసింగారం, తురకగూడెం గ్రామాల్లో కొనసాగుతోంది. ఇప్పటివరకు 9,188 మందికి పరీక్షలు నిర్వహించారని, వారిలో 2,208 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారని మెడికల్ ఆఫీసర్ కిశోర్ తెలిపారు.

వ్యాపారవేత్త మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మువ్వా రోశయ్య మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు మంగళవారం రోశయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బత్తుల మురళి, కన్నం ప్రసన్నకృష్ణ, అంజిరెడ్డి, లక్ష్మణ్, దానయ్య, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెంలో కుటుంబంపై దాడి చేసిన వారిపై కేసు నమోదైంది. రాయగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మిని అదే గ్రామానికి చెందిన రామకృష్ణ వేధిస్తుండటంతో ఇది సరికాదని చెప్పింది. ఇది మనసులో పెట్టుకుని తనతో పాటు భర్త గోపాల్‌రావు, మామ వెంకయ్యపై రామకృష్ణ, తిరపతిరావు, శ్రీను, సాయిగోపి దాడి చేసినట్లు నాగలక్ష్మి ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.స్రవంతి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

ఖమ్మంమామిళ్లగూడెం: విద్యార్థుల స్కాలర్‌షిప్‌తో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఖమ్మం నగర సంఘటన కార్యదర్శి తేజావత్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. బీఆర్ఎస్ అవిర్భావం పేరుతో రూ.కోట్లు ఖర్చు పెడతారని, విద్యార్థుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు యశ్వంత్, విజయ్, వేణు, నాగార్జున, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన కాపా ద్వారకి, ఉప్పునూటి ఐలమ్మ, తోట అనసూర్య, క్షత్రియ రత్నాబాయి, గుండా కోటేశ్వరరావు, కొలికపొంగు సుందరమ్మ, కొల్లా కేశవరావు, గెల్లా పార్థసారథి, కర్లపాటి సత్యవతి, గోరువుడి నాగమణి మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్, అపోలో, అగర్వాల్ ఐ బ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థిని దండించిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకుల పాఠశాల(ముదిగొండ) తొమ్మిదో తరగతి విద్యార్థి ఈ నెల 15న హౌస్‌మాస్టర్, కెమిస్ట్రీ తాత్కాలిక ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అనుమతి తీసుకుని ఇంటికి వెళ్లాడు. తిరిగి ఈ నెల 19వ తేదీన పాఠశాలకు వచ్చిన ఆయన హౌస్‌మాస్టర్‌కు ఫోన్‌లో చెప్పగా, తల్లిదండ్రులను తీసుకుని సోమవారం రావాలని సూచించాడు. కానీ సోమవారం ఉదయం తరగతికి విద్యార్థి హాజరుకావడంతో ఉపాధ్యాయుడు దండించాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న తల్లిదండ్రులు సోమవారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగగా హౌస్‌మాస్టర్‌గా తొలగించారు. కానీ మంగళవారం కూడా మళ్లీ వచ్చి వాదనకు దిగడంతో ఆర్సీవో ప్రత్యూష విచారణ చేపట్టారు. అనంతరం కెమిస్ట్రీ ఉపాధ్యాయుడిగా కూడా వెంకటేశ్వర్లును తొలగించారని వైస్ ప్రిన్సిపాల్ వీరఅంజయ్య తెలిపారు.

'ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'

నేలకొండపల్లి: ఎనిమిదేళ్లుగా ఇచ్చిన హామీలు అమలు చేయని సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని ముజ్జుగూడెం, అనాసాగారం, సదాశివాపురం గ్రామాల్లో మంగళవారం టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు హాథ్ సే హాథ్ జోడోయాత్ర నిర్వహించారు. ఇక నాచేపల్లిలో రాత్రి జరిగిన సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరముందని చెప్పారు. రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించలేని కేసీఆర్ దేశంలో పరిష్కరిస్తానని బయలుదేరడం గర్హనీయమని పేర్కొన్నారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. యాత్రలో కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యాతాకుల శ్రీనాథ్, యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్, జంగం లక్ష్మీనారాయణ, బొడ్డు బొందయ్య, కె.హన్మంతరావు, బోయిన వేణు, వడ్డే జగన్, వున్నం వెంకటేశ్వర్లు, యాకోబ్‌మియా పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

పేదల పక్షపాతి ఉదయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: తుదిశ్వాస వరకు పేదల సంక్షేమానికి పాటుపడిన పువ్వాడ ఉదయకుమార్ పేదల పక్షపాతిగా నిలిచారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. ఉదయ్‌కుమార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఖమ్మంలోని ఆయన స్తూపం వద్ద నివాళులర్పించాక వారు మాట్లాడారు. ఉన్నత విద్యనభ్యసించి పేదల పక్షాన నిలిచారని, నిత్యం ప్రజాసమస్యలపైనే పోరాడారని తెలిపారు. ఆయన ఆశయసాధనకు కృషిచేయాలన్నారు. ఇక రఘునాథపాలెం మండలం వైఎస్సార్‌నగర్‌లో ఉదయకుమార్ విగ్రహానికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు, విజయలక్ష్మి, మమత సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీతో పాటు పువ్వాడ సాయిశిరిణి, సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, కొండపర్తి గోవిందరావు, క్లైమెంట్, గోవిందరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, యానాలి సాంబశివారెడ్డి, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?



మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. మెయిన్ లైన్ చెరుకు పంటల మీదుగా వెళ్లటంతో నాలుగు రోజుల కిందట ఓ చోట తీగలు తెగి ఏడు ఎకరాల చెరకు తోట కాలిపోయింది. అదే ప్రాంతంలో మరో చోట విద్యుత్ తీగ తెగేందుకు సిద్ధంగా ఉంది. పలుమార్లు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-నేలకొండపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : బాలాజీ, ఏఈ, రాజేశ్వరపురం

సెల్ నంబర్ : 94910 58653